



# మాండలికంతో పాఠకులను దూరం చేసుకోవద్దు!!

**- అంపశయ్య నవీన్**

'అంపశయ్య' నవీన్ నవలా రచయితగా ఎంత సుప్రసిద్ధులో కథా రచనలో కూడా అంతే ప్రసిద్ధులు. వరంగల్ జిల్లా వావిలాలకు చెందిన ఈయన అధ్యాపకుడిగా జీవితం ప్రారంభించి ప్రిన్సిపాల్‌గా రిటైర్ అయ్యారు. చదువుకునే రోజుల నుంచే రచనలు ప్రారంభించిన నవీన్ 'అంపశయ్య' మొదలు 'అమెరికా..అమెరికా' వరకు మొత్తం 27 నవలలు, 'లైఫ్ ఇన్‌ఎ కాలేజ్', 'ఎనిమిదో అడుగు', 'ఫ్రమ్ అనూరాధ విత్ లవ్', 'నిష్కృతి' నాలుగు కథల సంపుటాలు వెలువరించారు. ఎన్నో అవార్డులు రివార్డులతో పాటు కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం అందుకున్న నవీన్ తన గురించి ఏమంటున్నారో చదవండి..

## ఎడ్ల బండ్లలో వెళ్లేవాళ్లం..

మాది వరంగల్ జిల్లాలోని వావిలాల గ్రామం. అమ్మానాన్నలు పిచ్చమ్మ, దొంగరి నారాయణ. మధ్యతరగతి వ్యవసాయ కుటుంబం మాది. మేం ఇద్దరం కొడుకులం, ఐదుగురు ఆడబిడ్డలు. నేను 24 డిసెంబర్ 1941న మా అమ్మమ్మగారి ఊరు మద్దిరాలలో పుట్టాను. మద్దిరాల మాకు ఇరవై ముప్పై కిలోమీటర్ల దూరంలో ఉండేది. మా అమ్మమ్మ వాళ్ల వూరుకు ఎడ్లబండ్లలో వెళ్లేవాళ్లం. అప్పట్లో వాహన సౌకర్యాలు తక్కువ కదా. పొద్దున్నే సద్దన్నాలు కట్టుకుని బండ్లలో బయలుదేరితే మద్దిరాల చేరేప్పటికి సాయంత్రం అయ్యేది. మధ్యలో వాగు వద్ద అందరం కూర్చుని సద్దన్నం తినేవాళ్లం.

## గోలీలాటంటే పిచ్చి యిష్టం..


నా బాల్యమంతా ఆటపాటలతో గడిచింది. గోలీలాట అంటే పిచ్చియిష్టం. గంటలకొద్దీ గోలీలాట ఆడుతూ ఉండేవాడిని. చిన్నప్పుడు నాకో మిత్రుడు ఉండేవాడు. వాడు గోలీలాట చాలా బాగా ఆడేవాడు. వాడికంటే బాగా ఆడాలని నాకు కోరిక. చెడుగుడు కూడా బాగా ఆడేవాడిని. దెబ్బలు తగులుతాయని ఆ ఆట ఆడ్డం మానేశాను. ఐదో తరగతిలో ఉండగా బాల్ బ్యాడ్మింటన్ ఆడటం మొదలు పెట్టాను. 1980 వరకు బ్యాడ్మింటన్ రెగ్యులర్‌గా ఆడాను. అమ్మాయిలంతా ఒక వైపు, అబ్బాయిలంతా ఒకవైపు ఉండి చిన్నప్పుడు 'బొమ్మల పెళ్లి' ఆడేవాళ్లం. పెళ్లిపాటలు పాడేవాళ్లం. డోలు, ఇతర వాయిద్యాలు వాయించే వాళ్లం. బొమ్మల పెళ్లి చాలా సరదాగా ఉండేది.

## కథలంటే చిన్నప్పటి నుంచీ ఆసక్తి

నాకు చాలా చిన్నవయసు నుంచే కథలంటే ఆసక్తి. మా చిన్నప్పుడు ఇప్పుడున్నంతగా ఎంటర్‌టైన్‌మెంట్లు లేవు. హరికథలు, వీధిభాగోతాలే మాకు ఎక్కువ. అవి మా చుట్టుపక్కలా ఎక్కడ జరుగుతున్నా వెళ్లేవాడిని. ప్రహ్లాద, గయోపాఖ్యానం తెల్లవార్లూ మేలుకుని చూసేవాడిని. వాటిని చూస్తున్నంత సేపూ నా ధ్యాసంతా కథపైనే ఉండేది. నేనయితే ఇలా రాసేవాడిని, అలా రాసేవాడిని అనుకునేవాడిని. చిన్నప్పటినుంచీ రాయాలనే కోరిక ఎక్కువ. మా నాన్న రైతే అయినా ఆయనకు సాహిత్యం అంటే ఆసక్తి. నాలుగో తరగతిలో మా మాష్టారు చెప్పిన కథను మార్చి రాసి చందమామకు పంపించాను. అది అచ్చుకాలేదు. 1958లో రాసిన 'చితికిన జీవితం' నా మొదటి కథ.

## పియుసిలోనే కథకు ఫస్ట్ ప్రైజ్

వరంగల్‌లోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీలో 1958లో పి.యు.సి.లో చేరాను. అక్కడే బి.ఏ. వరకు చదువుకున్నాను. నేను పియుసిలో ఉండగా మా కాలేజీలో కథల పోటీ పెట్టారు. 'చితికిన జీవితం' కథ రాసి పోటీకి పంపాను. సీనియర్ మోస్టులంతా పోటీలో పాల్గొన్నారు. అయితే జూనియర్ మోస్ట్ అయిన నా కథకు ప్రథమ బహుమతి వచ్చింది. తర్వాత ఆ కథను కాలేజీ మ్యాగజైన్‌లో వేశారు. 'యిది కథలా లేదు. నిజంగా జరిగినట్టే ఉంది' అని ఆ కథను చదివిన వాళ్లంతా చెప్పారు. జి.వి. సుబ్రమణ్యం అనే లెక్చరర్ నన్ను కథలు రాయమని బాగా ప్రోత్సహించారు. 'అధోలోకం' అనే కథ చైతన్యస్రవంతిలో రాసి 1965లో జయశ్రీ పత్రికకు పంపాను. వారు ఆ కథను ప్రచురించారు.



ఆర్.ఎస్. సుదర్శనంతో...



గోపీచంద్ నారంగ్ చేతుల మీదుగా కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు అందుకుంటూ...

కథను ప్రచురించినట్టుగా ఎలాంటి సమాచారం లేదుగానీ 12 రూపాయలు ఎం.ఓ. చేశారు. అప్పట్లో అది పెద్ద మొత్తమే!

## పుస్తకాలు సర్దడం ఇబ్బంది

మాది చక్కటి సంసారం. నా రచనా వ్యాసంగానికి నా భార్య అనసూయ సహకారం ఎంతో ఉంది. చిన్నచిన్న కంప్లయింట్స్ ఎవరికయినా ఉంటాయి కదా! నాకేమో పుస్తకాలు బాగా కొనడం అలవాటు. రాసుకునేప్పుడు రెఫరెన్స్ కోసమో లేదంటే చదువుకోడానికో పుస్తకాలు తీస్తాను. వాటిని తర్వాత ఎత్తిపెట్టడం మరచిపోతాను. అలా పుస్తకాలు ఎక్కడపడితే అక్కడే వదిలేస్తానని అనసూయ నన్ను విసుక్కుంటూ ఉంటుంది. ఒక్కోసారి నా మూడ్‌లో నేనుండి రాసుకుంటూ ఉంటాను. అప్పుడు సడన్‌గా వచ్చి కూరగాయలు కావాలనో మరేదో కావాలనో చెప్తుంది. అలాంటి సమయాల్లో చిరాకు అనిపిస్తుంది. ఇలాంటివి తప్ప మా జీవితం ఆనందంగానే గడుస్తోంది.

## యాక్టర్ కావలసిన వాడిని..

నాకు చిన్నప్పటినుంచీ కథలంటే ఎక్కువ ఇష్టం. అది క్రమంగా పెరుగుతూ వచ్చింది. దాంతో పాటు నటించాలనే కోరికా పెరుగుతూ వచ్చింది. పూణెలోని ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌లో చేరాలని అనిపించి, నాకు సినిమాల్లో నటించాలనుందని, నాకు నటనలో శిక్షణ కావాలని కోరుతూ ఆ ఇన్‌స్టిట్యూట్‌కి ఉత్తరం రాశాను. అక్కడ అడ్మిషన్ దొరకాలంటే సినిమాల గురించిన అవగాహన తప్పనిసరి. ఒక పెద్ద వ్యాసం రాసి పంపాలి. నేను రాసి పంపాను. కొంతకాలం తర్వాత నాకు అడ్మిషన్ ఇస్తున్నట్టు పూణె నుంచి ఉత్తరం వచ్చింది. అప్పటికే నాకు పెళ్లయింది. బాధ్యతలు పెరిగాయి. అందుకని నటనలో శిక్షణకోసం వెళ్లలేదు. కానీ సినిమాలపైన ఆసక్తితో ఎన్నో సినిమా వ్యాసాలు రాశాను. గత ఏడాది

వరంగల్‌లో నేరెళ్ల వేణుమాధవ్ ఆధ్వర్యంలో ప్రముఖ బాలీవుడ్ హాస్య నటుడు జానీ లివర్‌కు సన్మానం జరిగింది. ఆ కార్యక్రమంలో జానీ లివర్ నన్ను చూడగానే 'ఇప్పుడే ఇంత అందంగా ఉన్నారే, ఇక యౌవనంలో ఎలా ఉండి ఉంటారో? మీరు ఇక్కడ ఉండాల్సిన వారు కాదు, సినిమాల్లో ఉండాల్సిన వారు' అనడం నేను సినిమాల్లో నటించినంత ఆనందం కలిగించింది.

## నన్ను మార్చింది ఆ రెండు పుస్తకాలే!

కాలేజీలో కథలపోటీలో ప్రథమ బహుమతి వచ్చిందని చెప్పాను కదా. బహుమతిగా చలంగారి మ్యూజింగ్స్, బుచ్చిబాబు కథల పుస్తకం ఇచ్చారు. చలం స్త్రీల పక్షపాతి. బుచ్చిబాబు రచనల్లో చైతన్య స్రవంతి, పాత్రల అంతరంగ చిత్రణ నన్నెంతో ఆకర్షించాయి. ఇక శ్రీశ్రీ రచనలు. ఇవన్నీ నాలో రాయాలనే కోరికను తీవ్రంగా జ్వలింప చేశాయి. నాపైన వీరి ప్రభావం ఉంది.

## అప్పట్లో 90 శాతం బ్రాహ్మణ కథలే!

ఇప్పటి కథల్లో పెద్ద మార్పు ఉంది. అప్పట్లో 90 శాతం ఒక సామాజిక వర్గం- స్పష్టంగా చెప్పాలంటే బ్రాహ్మణుల కథలే ఎక్కువ. 80-85 నుంచి సమాజంలో అన్ని వర్గాలనుంచి కథలు వస్తున్నాయి. ముఖ్యంగా బిసిలు, వృత్తి పనివారు, మైనారిటీలు కథలు రాస్తున్నారు. ఒకప్పుడు వీళ్ల సమస్యలు తెలిసేవి కావు. వారి కుటుంబ జీవన శైలి, భాష, ఆచార వ్యవహారాలు.., యివన్నీ మనకు ఇప్పుడు తెలుస్తున్నాయి. యిప్పటి కథల్లో వైవిధ్యం వచ్చింది కానీ అధ్యయనం తగ్గింది. నేను కొన్ని వేల కథలు చదివి రాశాను. యిప్పటి రచయితలు చదవటం లేదు. దీంతో యిప్పటి యితివృత్తాలు రా మెటీరియల్‌గా వుంటున్నాయి. వాటిని నగిషీలు చెక్కి మంచి శిల్పాలుగా తయారు చేయాలంటే అధ్యయనం పెరగాలి.

## ప్రపంచమంతా ఇదే రూల్

యిప్పటి కథలు కొన్ని పూర్తి మాండలికంలో వస్తున్నాయి. మాండలికం సంభాషణలకే పరిమితం కావాలి. ప్రపంచమంతా ఇదేరూల్. వీర మాండలికం తగదు. వీరమాండలికంతో పాఠకులకు దూరమౌతున్నాం. ఇప్పటికే ఎల్‌క్ట్రానిక్ మీడియా వలన పాఠకులు దూరమయ్యారు. కథ మొత్తం మాండలికంలో నడిపి పాఠకులకు మరింత దూరం కావాలా? రచయితలు ఈవిషయాన్ని ఆలోచించాలి.

## పాటలు వింటేనే నిద్ర

మంచి కథను చదివినప్పుడు, మంచి సినిమా చూసినప్పుడు చాలా చాలా సంతోషం అనిపిస్తుంది. కుటుంబ సభ్యులతో ఎక్కడికయినా వెళ్లడం, మిత్రులతో గడపడం బాగా యిష్టం. ముఖ్యంగా పాటలంటే చాలా ఇష్టం. సెమిక్లాసికల్ పాటలు వినందే నిద్రరాదు. ఇంట్లో ఉన్నానంటే రోజూ తప్పనిసరిగా రాత్రి 10నుంచి 11 గంటలవరకు పాటలు వింటూ పడుకుంటాను.

## మేనరికం పెళ్లి..

మా మేనమామ కూతురు అనసూయ పుట్టిన మూడోరోజునే వాళ్లమ్మ చనిపోయింది. తల్లిలేని బిడ్డ అని మా ఇంట్లో అందరికీ బాగా ప్రేమ. అనసూయను మా నాయనమ్మే పెంచింది. చిన్నప్పుడే తను నా భార్య అని అందరూ అనేవారు. అన్నట్టుగానే 1962లో అనసూయతో నాకు పెళ్లయింది. మాకు ఒక కూతురు, ఇద్దరు కొడుకులు. అందరూ స్థిరపడ్డారు. మొదట్లో మా అమ్మాయి స్వప్న, కథలూ కవితలు రాసింది. తర్వాత పెళ్లి, ఉద్యోగంతో బాధ్యతలు పెరిగి రాయడం మానేసింది. చిన్నవాడు శశికిరణ్‌కు సాహిత్యం పట్ల ఆసక్తి ఎక్కువే!

### నచ్చినవి

రచయిత : చలం
కవి : శ్రీశ్రీ
పాట : మనసున మల్లెల మాలలూగెనే(మల్లీశ్వరి)
సినిమా : పథేర్ పాంచాలి
హీరో : దేవానంద్
హీరోయిన్ : సావిత్రి
కథ : గిఫ్ట్ ఆఫ్ ది మేగి (ఓ హెన్రీ)
నవల : వార్ అండ్ పీస్ (టాల్‌స్టాయ్)
వ్యక్తి : నరసింహారావు (లెక్చరర్)
వంట : పాయసం


కుటుంబ సభ్యులతో...

## అదో పరిమళం..!

ఉస్మానియా యూనివర్శిటీలో ఎం.ఎ. అయ్యాక ఓ ఆర్గనైజేషన్‌లో ట్రాన్సలేటర్‌గా చిన్న ఉద్యోగంలో చేరాను. గ్రామాలకు వెళ్లి అక్కడి జీవితాలను స్టడీ చేసేవాళ్లం. నాలాగా యింకా యిద్దరు ముగ్గురున్నారు. సరదాగా గడిచేది. ఒకసారి అందరం గండిపేటకు వెళ్లాం. అక్కడి ప్రదేశాలన్నీ తిరిగాం. నాలుగు రోజులున్నాం. నాతోపాటు వచ్చిన వారిలో అందమైన అమ్మాయి ఉండేది. పాటలు బాగా పాడేది. నాకు పాటలంటే ఇష్టం కదా! సహజంగానే మా ఇద్దరి మధ్యా సాన్నిహిత్యం పెరిగింది. అది ప్రేమ కాదు. మంచి స్నేహం. ఆ నాలుగు రోజుల తర్వాత మళ్లీ జీవితంలో ఆ అమ్మాయి ఎప్పుడూ తటస్థపడలేదు. అయితే ఆనాటి జ్ఞాపకాలు ఇప్పటికీ బాగా గుర్తే!

## యిప్పటికీ చెవుల్లో గింగురు మంటున్నాయి..

యిప్పటికీ గుర్తొస్తే బాధే! నాకు మొదటి ఫ్రెండ్ మా రాజమ్మక్క. తనకు ఎనిమిదేళ్లకే పెళ్ళయింది. సడెన్‌గా జబ్బు చేసింది. నాటు వైద్యం చేశారు. అక్క చనిపోయింది. అమ్మ భయంకరంగా ఏడ్చింది. ఆ ఏడుపులు ఇప్పటికీ నాచెవుల్లో గింగురు మంటున్నాయి. ఇప్పటికీ ఎవరైనా ఏడిస్తే తట్టుకోలేను. వెంటనే ఆనాటి సంఘటన గుర్తొస్తుంది.

- సుంకోజి దేవేంద్రాచారి

నాకు నచ్చిన
నా కథ

# ఫ్రమ్ అనూరాధ... విత్ లవ్

-అంపశయ్య నవీన్

గదిలో ఉన్న మాగజైన్లన్నీ మరోసారి తిరగేశాడు.
సినిమాలు, రాజకీయలు, కథలు, నవలలు, జోకులు, న్యూడ్ ఫోటోలు, కార్టూన్‌లు...
దేనిమీద అతని దృష్టి నిలవటం లేదు. ''బోరు'' అనుకున్నాడు.
''మీకు ప్రతీదీ బోరే''.
''ఒక్క నువ్వు తప్ప''
''కొంతకాలం పోతే నేనూ మీ బోర్ లిస్టులో ఎక్కిపోతానేమో?''
''ఇంపాజిబుల్''

''ఇప్పుడు మీరు వెంటనే కిరాణాకొట్టు కెళ్ళి ఈ సరుకుల్ని తెచ్చిపెట్టకపోతే ఈ రోజు నేను మీకు వంటచేసి పెట్టడం ఇంపాజిబుల్''

''అబ్బా! బోర్ లావణ్యా''

అతడు గట్టిగా కళ్ళు మూసుకొని బెడ్ మీద అటు ఇటు దొర్లాడు. లేచి కూజా దగ్గర కెళ్ళి గ్లాసులో మంచినీళ్లు వంపాడు. గ్లాసు నోటి దగ్గర పెట్టుకున్నాడు. కానీ నీళ్ళు తాగాలనిపించలేదు. విసుగ్గా గ్లాసు టీపాయ్ మీద పెట్టేసి ఈజీ చైర్లో కూర్చోబోయాడు. కాని కూర్చోలేదు. గ్లాసులోని నీళ్ళను పక్కనే ఉన్న అటాచ్డ్ బాత్ రూంలో పారబోశాడు.

టీపాయ్ పక్కనే ఉన్న నిలువుటద్దంలో పడిన అతని రూపం మీద దృష్టి పడింది. అద్దంలో తనను తాను చూసుకోవటం అతనికిష్టం.

''దోజ్ బ్యూటీపుల్ ఐస్ - దట్ కర్లీహేర్ - యువర్ మిస్చివస్ లిప్స్.... నువ్వు ఇంట్లోంచి బయట కెడ్తున్నావంటే భయమేస్తుంది డియర్-''

''ఎందుకు?''

''యే కొంటె పిల్లయినా ఎగరేసుకు పోతుందేమోనని''

''యే మత్తుమందో చల్లి ఈ కొంటెపిల్ల తన కొంగుకు కట్టేసుకుందిగా''

''యూ సిల్లీ''!

అద్దంలో తన పెదవుల్ని కసిగా ముద్దుపెట్టుకుంటున్న లావణ్య; కానీ మరుక్షణంలో తానొక్కడే.

అద్దాన్ని వెయ్యి ముక్కలుగా బద్దలు కొట్టాలనిపించిందతనికి. వెంటనే ఆ అద్దం ముందు నుంచి కదిలాడు.

టైమ్ చూశాడు.

పది గంటల అయిదు నిముషాలు.

ఇది వరకు చూసినప్పటికి ఇప్పటికి మూడు నిమిషాల కాలం మాత్రమే గడిచింది.

కాలం కదలదు. ఈ గది నాల్గుగోడల మధ్య కాలం స్తంభించింది. ఈ గదిలో తాను ఖైది.

మళ్ళీ బెడ్ మీదకు చేరాడు.

మళ్ళీ పత్రికలన్నీ తిరగేశాడు.

మళ్ళీ టైమ్ చూశాడు.

ఆ హోటల్ గది పైకప్పుకేసి, తెల్లగా వెలిగిపోతున్న ట్యూబ్‌లైట్ కేసి, గిరగిరా తిరుగుతున్న సీలింగ్ ఫ్యాన్‌కేసి చూశాడు.

బోర్, బోర్, బోర్.

అతడు బాధతో గట్టిగా కళ్ళు మూసుకున్నాడు. కాస్సేపటికి తెరిచాడు. అకస్మాత్తుగా అతనికా గదంతా కొత్తగా, అపరిచితంగా కనిపించింది. వెంటనే అతనికి భయమేసింది.

అసలు తనక్కడెందుకున్నాడు? తనకే మాత్రం పరిచయం లేని ఈ ఊరు. ఈ హోటలు గది, ఈ బెడ్డు, ఈ టేబుల్, ఈ టీపాయ్, ఈ అద్దం, ఈ కూజా, ఈ గ్లాసు, ఈ ఫ్యాను, ఈ ట్యూబ్‌లైటు వీటన్నిటి మధ్య తనెందుకున్నాడు?

ఈ పెద్దహోటల్లో ఎన్నోగదులు - ఎందరో మనుష్యులు, కాని తనకు ఎవళ్ళతోను సంబంధం లేదు. ఇది తనకు తెలిసిన ప్రపంచం కాదు.

అతడు మరోసారి అసహనంగా బెడ్ మీద అటూ ఇటూ దొర్లాడు అది పక్కాకాదు. అది పరువూ కాదు. ఈ పరువు నిండా పలుగురాళ్ళు నింపారు.

''అప్పుడే వెళ్ళిపోతావా డియర్, నువ్వు పక్కన లేకపోతే నాకిది పక్క కాదు''.

''మరేమిటో''.

''నువ్వు పక్కనుంటే ఇంత హాయిగా ఇంత మెత్తగా వున్న ఈ పరుపులోకి నువ్వు వెళ్ళిపోగానే పలుగురాళ్ళొచ్చేస్తాయి. ప్లీజ్ ఇంకాస్సేపు''.

''బయట పని మనిషి కేకలు పెడుతోంది. తలుపు తీయాలి. ప్లీజ్ వెళ్ళనీ''.

''పాడు పని మనిషి. అప్పుడే తెల్లారిందా?''

''ఎప్పుడో తెల్లారింది''.

''మళ్ళీ ఎప్పటికి దొరకుతావో''

''అబ్బబ్బబ్బ, వదలండి, రోజూ ఇలాగే-'

''వెళ్ళే ముందు జస్టే వన్‌మోర్, ప్లీజ్ లావణ్యా''.

''నో మోర్ ప్లీజ్, ఎన్ని మోర్లేనా మీకు సరిపోవు''

''అయితే ఎలా వెళ్తావో వెళ్ళు చూస్తాను''

''యేమిటి చూసేది?''

''నిన్నే''

''అయ్యో కర్మ''

''ఎందుకమ్మా పాపం, పొద్దున్నే కర్మంటున్నావు?''

''ఎందుకా? రోజు రోజుకీ మీ కొంటె చేష్టలు మితిమీరి పోతున్నందుకు''

''నేనేం చేశాను?''

''నటించటం చాలు గాని ఎక్కడ దాచారో త్వరగా యిచ్చేయండి. బయటది కేకలు పెడ్తోంటే''

''నువ్వే నన్నిలా పిచ్చివాణ్ని చేశావు''

''మీతో వాదించలేను బాబు! త్వరగా బట్టలిచ్చెయ్యండి''

''తమరిచ్చేదాకా నే నివ్వను''

''అయితే ఇలాగే లేచి వెళ్లిపోతాను''

''నిజంగా! అంత అదృష్టమా?''

''ఎంతాశ, ఈ బెడ్‌షీట్ కప్పుకొని పక్క గదిలోకెళ్ళి మరో డ్రెస్ వేసుకుని వస్తేగాని మీ రోగం కుదర్దుండండి''

''లావణ్య ప్లీజ్... ఒక్క నిముషం''

అతడు బెడ్‌షీట్ పట్టుకుని లాగాడు. కాని అది తన బెడ్‌షీట్ గాదు. హోటల్ గదిలో బెడ్ మీది బెడ్‌షీట్.

జ్ఞాపకాలు: ఈ జ్ఞాపకాలు ఒక్కొక్కసారి గుండెల్లో ఇంత చిచ్చుపెడతాయని అతనికి తెలియదు.

అతనిలోని ప్రతి అణువు బాధతో ఘూర్ణిల్లింది. వేడిరక్తంతో ఉప్పొంగిన అతని నరాలు ఏ క్షణం లోనైనా చిట్లిపోతాయేమోననిపించింది.

అతనికి వెంటనే లావణ్య కావాలనిపించింది.

లావణ్య వక్షోజాల్లో తలదూర్చి తన శరీరాన్ని ఆమె శరీరంతో పెనవేసి, తన పెదవుల్ని ఆమె పెదవు లతో కలిపేసి, తన సర్వస్వాన్ని ఆమె కర్పించి, ఆమె సర్వస్వాన్ని తను దోచుకొని, యుగాల్ని క్షణాలుగా, క్షణాల్ని యుగాలుగా మార్చేసుకుని, స్థలాన్ని కాలాన్ని జయించి. ఆనందపు శీతల శిఖరాల్ని అధిరోహించి, ప్రశాంత సుషుప్తిలోకి జారిపోతే తప్ప ఈ మనస్సుకు శాంతిలేదు. అగ్నిలా జ్వలించిపోతున్న ఈ శరీరం అప్పుడు గాని చల్లబడదు.

అతనికి వెంటనే యేమైనా చెయ్యాలనిపించింది.

వెంటనే లావణ్య దగ్గరకు పరుగెత్తుకొనిపోతే?

అసంభవం? తనకూ లావణ్యకూ మధ్య కొన్ని వందల మైళ్ళు దూరం, ఆ దూరాన్ని దాటేంత వరకు ఈ శరీరాన్ని ఓదార్చలేడు.

బాత్‌రూంలోకి వెళ్లి తెల్లవార్లూ చన్నీళ్ళస్నానం చేస్తూ ఉండి పోవాలనిపించింది. యే ఐస్ ఫ్యాక్టరీకైనా వెళ్లి ఐస్ ముక్కల మీద పడుకోవాలనిపించింది.

యెన్నో చేయాలి. యేదైనా చెయ్యాలి. లేకపోతే ఈ బాధ తన శరీరాన్ని తినేస్తుంది. ఈ రాత్రి గడిచేలోగా తనకు పిచ్చెక్కుతుంది.

అతడు విసురుగా లేచాడు.

చకచకా డ్రెస్ చేసుకున్నాడు.

రూం బయటకొచ్చి తాళం వేసి, లిఫ్టుకోసం ఎదురుచూసే ఓపిక లేక మెట్లు దిగి సెకండ్ ఫ్లోర్లోకొచ్చాడు.

అతనికెదురుగా వస్తున్న వాళ్ళనెవ్వరిని అతడు చూడలేదు. ఫ్యాంట్ జేబుల్లో చేతులు పెట్టుకుని త్వరత్వరగా మెట్లు దిగి కిందకొచ్చాడు.

రిసెప్షన్ రూంలోంచి బయటపడి, హోటల్ కాంపౌండ్ దాటి రోడ్డు మీదకొచ్చాడు.

''బండి కావాలా బాబుగారు?'' అంటూ అక్కడున్న రిక్షావాళ్ళంతా అతన్ని చుట్టుముట్టారు.

అక్కర్లేదని చెప్పేసి వాళ్ళ మధ్యలోంచి కదిలికొంచెం దూరం నడిచి పేవ్‌మెంట్ మీద నిల్చున్నాడు.

అతడికేం చెయ్యాలో తోచలేదు.

ఆ వూళ్లో ఉన్న సినిమాలన్నీ అతడు చూసేశాడు.

బార్‌కెళ్లి తాగే అలవాటు లేదతనికి.

ఆ ఊర్లో అతనికి ఫ్రెండ్సెవరూ లేరు.

''యే బ్రోతల్ హౌస్‌కైనా వెళ్తే'' మెరుపు మెరిసినట్టుగా అతని బుర్రలో ఈ ఆలోచన.

తనలో ఈ ఆలోచన కల్గినందుకు తనను తాను అసహ్యించుకున్నాడు.

ఈ బుర్రక్షణం కూడా ఊర్కోదు.... ఎప్పుడూ యేదో చెత్తను సృష్టిస్తూనే ఉంటుంది. ఈ ఆలోచనలు జ్ఞాపకాలు లేకపోతే ఎంత బావుండును.

''యేం బాబుగారూ! ఒంటరిగా ఉన్నట్టున్నారే... టైమ్ గడవటం లేదా?'' అతడు వెంటనే పక్కకు తిరిగి చూశాడు.

అతని పక్కనెవరో కొత్త మనిషి నిల్చొని వున్నాడు.

''నువ్వెవరు''



''నే నెవరైతే యేం బాబు, మీరు మాత్రం ఒంటరితనంతో మహా ఇబ్బంది పడిపోతున్నట్టున్నారు. ఈ ఒంటరి తనం మహాచెడ్డది బాబూ, మనసుకు పిచ్చెత్తిస్తుంది''

ఈసారతన్ని పరీక్షగా చూశాడు.

కాకి నిక్కర్, చిరుగుల బనియన్,అక్కడక్కడ తెల్ల వెంట్రుకలతో మాసిన గడ్డం, రెల్లుగడ్డిలా పల్చగా నెత్తిమీద జుట్టు, ఎర్ర జీరలతో మెరుస్తున్న చిన్న చిన్న కళ్ళు. సన్నగా పొట్టిగా వున్నాడు.

''ఆఫీసు పనిమీదొచ్చారా బాబూ?''

''ఔను''

''టైమ్ గడవక చాలా దిగులుబడి పోతున్నట్టున్నారు''.

''ఔను. కాని నువ్వేం నా మీద జాలి చూపించాల్సిన అవసరం లేదు. మైండ్ యువర్ బిజినెస్''.

అతడు అక్కడికి కొంచెం దూరంలో వున్న కిళ్ళీ కొట్టు వైపు నడిచాడు.

''నా బిజినెస్సే ఇది సార్'' అతన్ని వెంబడిస్తూ తగ్గు స్వరంతో అన్నాడు కాకినిక్కర్ వాడు.

''ఏది?''

''మీలాంటి వాళ్ళ దిగులును, వంటరితనాన్ని పోగొట్టటం''

''ఎలా పోగొడ్తావు?''

''మీరు ఊఁ అనండి బాబూ''

''అంటే''

''మీకు మంచి కంపెనీని తెచ్చిపెడ్తాను'

''మంచి కంపెనీ అంటే?''

''మంచి పిల్లను తెచ్చిపెడ్తాను''

''ఓహో''

వెంటనే అతనికి తెలియకుండానే అతని హృదయాంతరాళంలో ఎక్కడో ఒక సంతోషకెరటం లేచింది.

''ఔను బాబూ! మీకెలాంటి పిల్ల కావాలో చెప్పండి. రాత్రంతా వుండమంటారా? కొన్ని గంటలు చాలా? చెప్పండి సార్''

తను వెంటనే తనను తాను రక్షించుకోకపోతే, తనను వాడు ఏదో ఊబిలోకి తోసేస్తాడనిపించింది.

''ఏయ్ మిస్టర్? ఎవరితో మాట్లాడుతున్నావో తెలిసే మాట్లాడుతున్నావా? పిచ్చిపిచ్చిగా వాగా వంటే పోలీసుల కప్పగిస్తాను. యూ డర్టీ పింప్''!

కిళ్ళీ కొట్టు వైపు వెళ్ళబోతున్న అతడు గిరిక్కున వెనక్కి తిరిగి హోటల్ వైపు కదిలాడు.

నాస్టీ ఫెలో! ఇలాంటి వాళ్ళు ఈ విజయవాడ పట్టణంలో కోకొల్లలుగా వుంటారని విన్నాడు. కాని నిజంగా చూడటం ఇదే ప్రథమం.

అతడు హోటల్ ఆవరణలో ప్రవేశించి రిసెప్షన్ రూం దాటాడు.

మెల్లగా, భారంగా ఒక్కొక్క మెట్టే ఎక్కసాగాడు.

వాడు నిజంగా తను ఎలాంటి పిల్ల కావాలంటే అలాటి పిల్లను తెస్తాడా? డర్టీ స్కౌండ్రల్, కోస్తున్నాడేమో!

లేదు. నిజంగా తెస్తాడేమో – ఈ ఊళ్ళో అలాంటి వాళ్ళు చాలామంది వుంటారని విన్నాడు.

అతని అడుగులు తడబడ్డాయి.

మళ్ళీ ఆ గది – ఆ బెడ్ – ఆ మాగజైన్స్. ఆ నాలుగ్గోడలు, ఆ జ్ఞాపకాలు... వద్దు , వద్దు చిత్ర హింసనిక భరించలేడు.

ఇప్పుడా గదిలోకెడ్తే తనకు నిజంగా పిచ్చెక్కుతుంది. బయటే యెక్కడన్నా గడపాలి. కాని యిప్పుడు బయటకెడ్తే వాడు – ఆ కాకి నిక్కరు వాడు తనను నీడలా వెంబడిస్తాడు. వాడిని తప్పించుకోలేడు.

అతని గుండెల్లో ఏదో వణుకు ప్రారంభమైంది.

కొన్ని సెకన్లలో అతడు తను మెట్లెక్కడం లేదని మెట్లు దిగుతున్నాడని గ్రహించాడు.

రిసెప్షన్ రూం దాటి హోటల్ ఆవరణలో ప్రవేశించాడు.

వాడు కనిపించడేం? అప్పుడే ఏమయిపోయాడు. వెళ్ళిపోయాడా? లేదు అడుగో – వాడు తనవైపే వస్తున్నాడు. వాడి వైపు చూడకూడదు. వాడితో మాట్లాడకూడదు. వాడు తన దగ్గరకొస్తే వాడిని తన్నాలి.

''ఎందుకు సార్ మీలో మీరు బాధ పడిపోతున్నారు. మీరు ఊఁ అనండి, రాత్రంతా మీకు స్వర్గమై పోతుంది''.

''షటప్!'' అన్నాడేగాని ఆ మాటలో ఏ మాత్రం ఫోర్స్ లేదు. వాడు నిశ్చలంగా అతని పక్కనే నిల్చుని ఈ సారింకా ధైర్యంగా అన్నాడు.

''నా మాట నమ్మండిసార్, మీ కెలాంటి పిల్ల కావాలంటే అలాంటి పిల్లను మీ గదిలో దింపుతాను. హోల్‌నైట్ వుంచుకోవచ్చు''

రెండు మూడు క్షణాల వరకు అతడేమీ మాట్లాడలేక పోయాడు.

తన గొంతు పూడుకుపోయిందేమో అనిపించిందతనికి.

అయినా యేదో చెప్పాలన్న పెనుగులాట అతన్ని వదల్లేదు.

''నిజంగా... నిజంగా...''

''చెప్పండి సార్...''

''కాస్త చదువూ సంస్కారం ఉండాలి. శుభ్రంగా ఉండాలి. చలాకీగా ఎప్పుడూ నవ్వుతూ నవ్విస్తూ వుండే అమ్మాయి కావాలి. పెద్దపెద్ద కళ్ళతో సన్నగా తెల్లగా వుండే అమ్మాయి కావాలి. తేగలవా?''

''తెస్తాను సార్... మీరు రూంలో కెళ్ళిపోండి సార్. పావు గంటలో వచ్చేస్తుంది. మీ రూం నెంబరు చెప్పండి సార్''.

''ఫోర్టీటూ.... ఆ అమ్మాయి నేను చెప్పినట్టుగా లేకపోతే వెంటనే బయటకు పంపించేస్తాను''

''అలాగే సార్''.

వాడు మరుక్షణంలో అక్కణ్ణుంచి మాయమై రోడ్డుమీదున్న ఓ రిక్షా ఎక్కాడు.

తను అన్నీ లావణ్య పోలికలే చెప్పాడు.

ఈ విషయం లావణ్యకు తెలిస్తే?

నీ జ్ఞాపకాల నుంచి పారిపోవటానికే ఈ పని చేశానని, నన్నింతగా నీ బానిసను చేసుకోవటం నీ తప్పేనని చెప్పాలి.

లావణ్య తనని క్షమిస్తుందా? కాదు... కాదు... తనని తాను క్షమించుకోగలుగుతాడా?

చాలా పెద్ద ప్రమాదంలో ఇరుక్కోబోతున్నాడు.

''చాలా పెద్ద ప్రమాదం జరిగిపోయింది లావణ్యా!''

''యేమైందండీ? ఎందుకంతగా నీరసించిపోయారు?''

''మా కంపెనీ సేల్స్ చూసే పని మీద నన్ను సరిగ్గా పది రోజులు విజయవాడకు పంపిస్తున్నాడు మా జనరల్ మేనేజర్''.

''హమ్మయ్య! అంతేగదా! మరేమిటోనని హడలిపోయాను''.

''అంతేకదా అని యెంత సులభంగా అనేశావు లావణ్యా! ఈ విషయం తెలిసినప్పటి నుంచి నేనెంత దిగులు పడిపోతున్నానో, ఎంత మానసిక చిత్ర



హింస ననుభవిస్తున్నానో, కొంచెం కూడా అర్థం చేసుకోలేక పోయావు. ఛీ! మీ ఆడవాళ్ళంతా యింతే!''

''ఎందుకండి వూరికే అలా దిగులుబడి పోతారు. ఆఫీసు పనున్నప్పుడు వెళ్ళడం తప్పు తుందా?''

''తప్పదు గనకనే ఈ దిగులు. నిన్ను విడిచి ఈ సంవత్సరన్నర కాలంలో ఎప్పుడైనా వరుసగా పది రోజులు. మైగాడ్! పది రోజులు! మళ్ళీ ప్రాణాలతో నిన్ను చేరుకోగలనంటావా?''

''తప్పకుండా చేరుకుంటారు. మీ ప్రాణానికి నా ప్రాణం. ఔను. మీ ఆఫీసులో మరెవరూ లేనట్టు మిమ్మల్నే ఎందుకు పంపిస్తున్నారేమిటి?''

''కర్మ! ఈ పని మా డిప్యూటీ మేనేజర్ గాడిది. వాడు నెల రోజులు సెలవు పడేసి ఎక్కడికో చెక్కే శాడు. అందుకని నన్ను పంపిస్తున్నారు. రేపే వెళ్ళాలి''.

ఆ రాత్రి - లావణ్య తనూ శృంగార ప్రపంచపు టవతలి అంచుల్ని చేరుకొని అవధుల్లేని ఆనందాన్ని అనుభవించారు.

''ఈ పది రోజులు నీ స్పర్శను పొందలేని నా యీ శరీరం ఎంత కృశించి పోతుందో, ఎంత ఆక లిని, ఎంత దాహాన్ని భరించాలో ఊహిం చుకుంటేనే భయమేస్తోంది''

''ఆ ఆకలిని, దాహాన్ని భరించలేక అడ్డదా రులు తొక్కరుగా?''

''అడ్డదారులా? కలలో కూడా నీతో తప్ప మరో స్త్రీతో ఎలాంటి అనుభవాల్ని పొందలేను. నీతో నేను పొందుతున్నది కేవలం శారీరక సుఖ మేననుకుంటున్నావా? హృదయాలు యేకం కాకుండా శరీరాలు మాత్రమే యేకం కావడాన్ని నేను ఊహించుకోలేను-''


''యేమో! మీ మగవాళ్ళ మాటలు నమ్మేట మెలా?''

అతడు భారంగా అడుగులు వేస్తూ తన రూంను చేరుకున్నాడు.

తాళం తీసి తలుపు తెరచుకొని లోపల కెళ్ళి యీజీ చెయిర్లో కూర్చున్నాడు.

వాడు నిజంగా తను చెప్పిన పోలి కలన్నీ ఉన్న అమ్మాయిని తెస్తాడా? తను నిజంగా అలా చెప్పాడా.

ఇటె



# కథాంతరంగం



ఒకసారి విజయవాడలో నాలుగు రోజులు ఉండాల్సి వచ్చింది. ఏలూరు రోడ్డు దగ్గర ఉండే 'బృందావన్' హోటల్‌లో దిగాను. ఒక రోజు సాయంత్రం ఏడు ఏడున్నర గంటల సమయంలో కిందకు దిగాను. రోడ్డుపైన తిరుగుతుంటే ఒకతను నా దగ్గరకు వచ్చి గుసగుసగా ''మంచి అమ్మాయి ఉంది, తీసుకురమ్మంటారా?'' అన్నాడు.

నేను కోప్పడ్డాను.

హోటల్ మెట్లెక్కుతుంటే అతను నా వెనకే వచ్చాడు. ''కాలేజీ అమ్మాయి ఉంది. తీసుకు రమ్మంటారా?'' అన్నాడు మళ్లీ.

నేనలాంటి వాడిని కాదని తిట్టి అతన్ని పంపించేశాను. రాత్రి లైటార్పి పడుకున్నాను. అయితే నా మనసులో ఓ ఊహ. నిజంగా అమ్మాయి వచ్చి ఉంటే.. చదువుకున్న అమ్మాయి అయితే ఎలా బిహేవ్ చేసేది.. చదువుకోని అమ్మాయి అయితే ఎలా బిహేవ్ చేసేది.. ఇలా రకరకాల ఆలోచనలు సాగాయి. దాన్నే 'ఫ్రమ్ అనూరాధ విత్ లవ్' కథగా రాశాను. నేనయితే నిజంగా కథలోలానే చేసేవాడిని.

– అంపశయ్య నవీన్
సెల్: ***9989291299***

జోక్! జస్ట్ ఫర్ ఫన్! యేదో రకంగా కాస్సేపు టైమ్ గడవడానికి అలా చెప్పాడు.

కాని వాడు నిజంగా అమ్మాయిని తీసుకొస్తే?

కాల్‌గర్ల్స్‌ను గురించి ఎన్నో కథల్లో, నవలల్లో చదివాడు. సినిమాల్లో చూశాడు. వాళ్ళు వీళ్ళు చెప్పు కోగా విన్నాడు. కాని నిజంగా వాళ్ళు ఎలా వుంటారో తానెన్నడూ చూడలేదు.

టైమ్ చూశాడు. వాడు వెళ్ళి చాలా సేపే అయింది. ఇంకా రాడేం?

మైగాడ్! తను ఆమె కోసం ఎదురు చూస్తున్నాడా?

''ఏమో! మీ మగవాళ్ల మాటలు నమ్మటమెలా?''

బయట మెల్లగా తలుపుమీద కొట్టిన చప్పుడు. అతడు దిగ్గున లేచి నిల్చున్నాడు.

''వచ్చేసిందా?'' అతనిలో భయంకరమైన క్యూరియాసిటీ. వణుకుతున్న చేతులతో తలుపు తీశాడు.

బయట నిల్చున్న పద్దెనిమిదేళ్ళమ్మాయి చప్పున లోపలకొచ్చేసి తలుపులు మూసేసింది.

వెంటనే గుప్పుమని గదినిండా మల్లెపూల వాసన వ్యాపించింది.

అతడామెకేసి కళ్ళప్పగించి చూస్తూ వుండిపోయాడు. జరిగిందేమిటో అతనికర్థం కావడం లేదు.

చేతిలో వున్న హాండ్‌బ్యాగ్‌ను టీపాయ్ మీద పడేసి, బెడ్ మీద కూర్చుని, పత్రికల్ని తిరగెయ్యటం మొదలెట్టిందామె.

''మీరు మాగజీన్లు తెగ చదివేట్టున్నారే!''

అతడేమీ మాట్లాడలేక పోయాడు. ఆమెనలాగే చూస్తూ ఉండి పోయాడు.

ఇంచుమించు తను చెప్పిన పోలికలన్నీ ఆమెలో ఉన్నాయి. ఎంతో గౌరవనీయులైన కుటుంబానికి చెందిన స్త్రీలా వుంది. అప్పుడే విచ్చుకుంటున్న మల్లె పూవులా స్వచ్ఛంగా, శుభ్రంగా వుంది. సన్నగా పొడుగ్గా, కోల మొహంతో, పెద్దపెద్ద కళ్ళతో ఎదుటి వ్యక్తిని వెంటనే ఆకట్టుకునే చిరునవ్వుతో యెంతో అందంగా ఆకర్షణీయంగా వున్న ఆమెను బయట చూస్తే యెవరైనా ఏ కాలేజీలోనే చదువుకుంటున్న అమ్మాయనుకుంటారు. చాలా సింపుల్‌గా అలంకరించుకుంది. శుభ్రంగా వున్న బ్లూప్రింట్ వాయిల్ చీర, అదే రంగు జాకెట్... జడనిండా మల్లెపూలు.

''వాట్ మిస్టర్ విశాల్: అంత సీరియస్‌గా ఆలోచిస్తున్నారేమిటి?''

అతడు వులిక్కిపడ్డాడు.

తన పేరు ఈవిడకెలా తెలిసింది? కొంపదీసి ఈమెకు తనుయెవరో, యేమిటో, యెక్కన్నించి వచ్చాడో అన్నీ తెలుసా యేమిటి?

''నా పేరు నీకెలా తెలుసు?''

''మీరు యేమి చెప్పకుండా బిగుసుకుని కూర్చుంటే మీ పేరు తెలుసుకునే మార్గమే లేదనుకున్నారా యేమిటి? ఇదిగో ఈ ''ఇండియా టుడే'' మాగజీన్ మీద మీ పేరు స్పష్టంగా రాసుంది''.

అతడు నవ్వాడు.

''యూ ఆర్ వెరీ క్లెవెర్''

''థాంక్యూ... మీరు మాగజీన్లు తెగ చదివేట్టున్నారే''

''కొత్త ప్రదేశంలో మన ఒంటరితనాన్ని పోగొట్టేవి మాగజీనులేగా''

''మీకు వంటరితనమంటే భయమా?''

''ఔను''

''ఫ్రెండ్సెవరూ లేరా?''

''లేరు''

''నాతో ఫ్రెండ్‌షిప్ చేస్తారా?''

''ఇంకో కొన్ని గంటల్లో నువ్వెక్కడో... నేనెక్కడో... నీతో ఫ్రెండ్‌షిప్పేమిటి?''

ఆమె అదో మాదిరిగా నవ్వింది.

''ఎందుకు నవ్వావు?''

''ఊరికేనే – నా నవ్వు మీకు నచ్చలేదా?''

''నచ్చక పోవటం కాదు. అంత బాగా నవ్వటం ఎక్కడ నేర్చావని? బైది బై.... నీ పేరేమిటి?''

''అనూరాధ''

''నైస్ నేమ్''

''థాంక్యూ''

''ఏం చదివావు?''

''ఇంటర్మీడియట్ చదువుతూ ఆపేశాను. యెందుకాపేశానని మాత్రం అడక్కండి''.

''ఎందుకని''?

''మీతో ఉన్నంత సేపు నన్ను లైవ్లీ ఉండనీయండి''

అతడు వెంటనే యేమీ మాట్లాడలేదు. ఆమెను మీ తల్లిదండ్రులెవరు? ఇంత చదువూ సంస్కారం ఉన్నదానివి ఇలాంటి పనెందుకు చేస్తున్నావు? అని అడగాలనుకున్నాడు. కాని ఆమె అలా అనడంతో ఆ ప్రయత్నం మానుకున్నాడు.

''ఆఫీసు పనిమీదొచ్చారా ఈ ఊరు?''

''ఔను''.

''ఈ ఊరు మీకెలా ఉంది?''

''వచ్చినప్పట్నుంచి ఈ ఊర్ని విడిచి మళ్ళీ మా ఊరు వెళ్ళటానికింకా యెన్ని గంటలు, యెన్ని నిమిషాలు, యెన్ని సెకన్లు వున్నాయని లెక్కించుకుంటున్నాను. దాన్ని బట్టి ఈ ఊరు నాకెలా వుందో నువ్వే ఊహించుకోవచ్చు''.

''మీ వూళ్లో మీకున్న అంత పెద్ద ఆకర్షణేమిటో తెలుసుకోవచ్చా?''

''కొన్ని విషయాల్ని బయటికి చెప్పకుండా మన మనస్సులో దాచుకుంటేనే అందంగా ఉంటుంది''.

''మీ మనసులో మీరు దాచుకున్న అంత అందమైన విషయమేమిటో నేను చెప్పనా?''

''చెప్పలేవు''.

''చెబితే ఏమిస్తారు?''

''నువ్వు కోరుకున్నదేదైనా... ఆఫ్‌కోర్స్: నా పరిధిలో నాకు సాధ్యమయ్యేదైతే''

''తర్వాత మాట తప్పొద్దు''.

''తప్పను గాక తప్పను''.

''ఏమో, మీ మగవాళ్ల మాటలు నమ్మటమెలా?''

అతడు వెంటనే అసహనంగా చైర్‌లోంచి లేచాడు. ఆమె తన ఆయువు పట్టుమీద దెబ్బకొట్టి నట్టుగా విలవిల్లాడిపోయాడు.

''మీ ఆడవాళ్ళెప్పుడు ఇలా 'మీ మగవాళ్ళ మాటలు నమ్మటమెలా?' అని యెందుకంటారు? అయామ్ డెడ్ సీరియస్ ఎబౌట్ మై ప్రామిస్. వైడోంట్ యు బిలీవ్ మి?''

''అయామ్ సారీ''

''ఇట్స్ ఆల్‌రైట్! మై ప్రామిస్ స్టిల్ స్టాండ్స్''

ఆమె నవ్వింది. ఆ నవ్వు అతని హృదయం మీద పన్నీటి జల్లును చిలకరించింది. ఆమె యెప్పుడు అలా నవ్వుతూ వుండిపోతే యెంత బావుండును.

''మీకు మీ ఊళ్లో వున్న ఆకర్షణేమిటో చెప్పాలి. కరెక్టుగా చెబితే నేను కోరుకున్నదేదైనా యిస్తారు. అంతేగా?''

''ఔను, ఔను, సస్పెన్సుతో చంపక, త్వరగా చెప్పెయ్''

''చెబుతున్నాను.... చెప్పేస్తున్నాను. రెడీ?''

''రెడీ''.

''మీ వూళ్లో మీకున్న ఆ గ్రేటెస్ట్ ఆకర్షణ. మీ లావణ్య: మీ ముద్దుల శ్రీమతి... మీ సర్వస్వం... కరెక్ట్?''

అతడు యెగిరి గంతేశాడు. అతనిలో చెలరేగిన ఎక్సైట్‌మెంట్‌ను అణచుకోలేక పోయాడు. ఆశ్చర్యం, భయం ఉత్కంఠ, ఆనందం ఒకేసారి జనించి అతన్ని వుక్కిరి బిక్కిరి చేశాయి.

అప్రయత్నంగా అతడామె దగ్గరగా వెళ్ళి ఆమె భుజాల మీద చేతులు వేసి ఆమెను కుదిపేశాడు.

''మా లావణ్యా నీకు తెలుసా? యెలా తెలుసు?''

''భయపడకండి. మీ లావణ్యా నాకు తెలీదు''.

''మరెలా చెప్పావు?''

ఆమె పకపకా నవ్వుతూ బెడ్‌మీది దిండుకిందున్న పోస్టు కవరు తీసి అతనికి చూపించింది.

అతడారోజు సాయంత్రమే లావణ్యకు ఉత్తరం రాసి, ఆ కవరులో పెట్టి పైన అడ్రసు రాసి పోస్టు చేద్దామని, ఆ దిండు కింద పెట్టాడు.

ఆ కవరు చూడగానే అతడు గాఢంగా నిట్టూర్చాడు.

''యూ ఆర్ రియల్లీ ఫెంటాస్టిక్ అనురాధా. కమాన్... ఏం కోరుకుంటావో కోరుకో.''

ఆమె అతడి మాటలు వినిపించుకోకుండానే ''చాలా అదృష్టవంతురాలు'' అంది.

''ఎవరు?''

''మీ లావణ్య''

''ఎందుకు?''

''ఆమెను ఇరవై నాలుగ్గంటలూ ప్రేమిస్తున్న మీలాంటి భర్త దొరికినందుకు''

''యూ ఆర్ రాంగ్, నిజంగా లావణ్యను అంత ప్రేమిస్తున్న వాడినయితే ఇప్పుడిలా నీతో యెందు కుంటాను? నేనే పెద్ద మోసగాడ్ని''

''కాదు. మీరు నన్నెందుకు పిల్చారో నాకిప్పుడే అర్థమైంది. మీ లావణ్య జ్ఞాపకాల నుండి కాసేపు పారిపోవడానికి నన్ను పిల్చారు''.

ఆ క్షణంలో ఆమె అతనికి చాలా దగ్గరయ్యింది. ఆమె మామూలు స్త్రీ కాదనిపించింది.

''నేను నీకు యెంత దగ్గర కాకూడదనుకుంటున్నా యేదో అద్భుతశక్తితో నన్ను నీ వైపు లాక్కుంటున్నావు. నిన్నేం చెయ్యాలో నాకర్థం కావటం లేదు. ఒకర్నొకరు ఇంత బాగా అర్థం చేసుకోవటం కూడా ఒక్కొక్కసారి చాలా విచిత్రమైన సమస్యల్ని సృష్టిస్తాయి కదూ!''

ఆమె అతడికేసి చురుగ్గా చూసింది

''విశాల్‌గారు! మీకు నేనెలాంటి సమస్యను సృష్టించబోవటం లేదు. ఇంకో కొన్ని గంటల్లో మీరే ఇంతకు ముందున్నట్టు మీరెక్కడో, నేనెక్కడో, మనం కలిసున్నంత సేపైనా హాయిగా గడుపుదాం. రండి మీ లావణ్యను మీరు కాస్సేపైనా మరచిపోయేట్టు చేస్తాను... కమాన్!''

ఆమె బెడ్ మీద మత్తుగా అటూ ఇటూ దొర్లింది.

అతడు కదల్లేకపోయాడు. ఆమెను అలాగే చూస్తూ ఉండిపోవాలనిపించిందతనికి.

''ఎంతసేపని అట్లా చూపులతో తినేస్తారు. నిద్దరొస్తోంది. డియర్: త్వరగా రండి'' అనురాధ ట్యూబ్‌లైటార్పేసింది.

ఎర్రగా వెలుగుతున్న జీరో కాండిల్ బల్బు కాంతిలో ఆమె అతని కళ్లకింకా అందంగా, అభిలషణీయంగా కనిపించింది.

''నిద్దరొస్తోంది డియర్, ఆ పాడు మాగజిన్ మూసేసి లైటార్పేసి, రండి ప్లీజ్''! బెడ్ మీద మత్తుగా దొర్లుతూ లావణ్య.

''ఇదిగో వచ్చేస్తున్నా... ఒక్క నిముషం''

''అబ్బబ్బబ్బ... నా కంటె మీకా చెత్త పత్రికే ఎక్కువైందా?''

''యూ ఆర్ వేస్టింగవర్ టైమ్ డియర్, కమాన్, రిలాక్స్! బెడ్ ఈజే బెస్ట్ ప్లేస్ ఫర్ రిలాక్సేషన్''

మంత్ర ముగ్ధుడిలా అతడామె దగ్గరగా వెళ్ళాడు.

అతన్నామె గట్టిగా గుండెలకదుముకుంది.

మల్లెపూల పరిమళం అతనిని మత్తెక్కించింది.

జూలు విదిలించి గర్జించిన సింహంలా అతనిలో కోరిక విజృంభించింది.

ఆమెను తన గుండెల మీదకు చేర్చుకొని ఆమె పెదవుల కోసం వెతికాడు.

''జస్ట్‌మినిట్, వదలండి''

''ఎందుకు డియర్?''

''మరచిపోయాను''

''ఏమిటి?''

''పిల్''

''ఫర్వాలేదు... యీ ఒక్కసారికి... నా మూడ్ పాడు చెయ్యకు''

''మీకు ఒక్కసారికే... కాని నా కొంప మునుగుతుంది''

''ఏమౌతుంది డియర్... పాపో, బాబో పుడ్తారే అనుకో... పెంచుకునే శక్తి మనకు లేదా?''

''మిస్టర్ విశాల్, ఏమిటి మీరంటున్నది?''

అతడు మూసుకున్న కళ్ళను తెరిచాడు. వెంటనే అతని శరీరం జలదరించింది.

కళ్ళు పెద్దవిచేసి ఆమెను చూశాడు. వెంటనే ఆమెను వదిలేసి పక్కమీంచి లేచి చైర్లో కూర్చున్నాడు.

''సారీ అనురాధా, యీ రోజంతా నేనేం చేస్తున్నానో నా కర్థం కావటం లేదు. అయామ్ జస్ట్ గోయింగ్ మ్యాడ్''.


''మీ మ్యాడ్‌నెస్‌ను యిప్పుడే పోగొడ్తానుండండి''

ఆమె బెడ్ మీంచి లేచి హ్యాండ్ బ్యాగ్ చేతిలోకి తీసుకొని, అందులోంచి ఓ టాబ్లెట్ తీసింది.

''ప్లీజ్ స్టాపిట్. నువ్వా టాబ్లెట్ వేసుకోవలసిన అవసరం లేదు''

''ఎందుకు''

''ఐ జస్ట్ కాంట్ డూ ఇట్''



''వైనాట్? నేనంత వికారంగా వున్నానా?''

''నో నో నో... యూ ఆర్ వెరీ బ్యూటీఫుల్''

''దెన్ కమాన్''.

ఆమె టాబ్లెట్ నోట్లో వేసుకుని మంచినీళ్ళు తాగింది.

''అనురాధా, ఐలైక్ యూ వెరీమచ్. ఇంకాస్సేపైతే తెల్లవారుతుంది. అప్పటివరకు ఇలాగే హాయిగా మాట్లాడుకుంటూ కూర్చుందాం''.

ఆమె కళ్ళు పెద్దవిచేసి అతన్ని ఆశ్చర్యంగా చూసింది. ఆమెలో అకస్మాత్తుగా ఏదో మొండి పట్టుదల. తను ఇలాంటివాళ్ళ నెందరినో చూసింది. అందర్నీ తన అందంతో లొంగతీసుకుంది.

''నో మ్యాన్ కెన్ రెసిస్ట్‌మీ'' అనుకుంది. అలాంటి వాళ్ళందరిలో లేని ప్రత్యేకత ఇతనిలో ఏముందో చూడాలనిపించింది.

''మీరు ఇంతకుముందే నాకో మాటిచ్చారు. గుర్తుందా?''

''ఔను''

''నేను కోరుకున్నదేదైనా ఇస్తానన్నారు''

''నాకు సాధ్యమైతేనే ఇస్తానన్నాను''

''యూ ఆర్ ఎ రోబస్ట్ మ్యాన్. మీకు సాధ్యం కాకపోవటమేమిటి?''

''యేమిటది?''

''ఈ రాత్రి మీరు నాకు కావాలి. మీకు లావణ్య ఇవ్వలేంది నేనిస్తాను, కమాన్... మాట తప్పొద్దు''.

ఆమెకేం సమాధానం చెప్పాలో అతనికి తోచలేదు.


ఆమె చకచకా తను వేసుకున్న బట్టలన్నీ విప్పేసి, బెడ్ మీద పడుకొని బెడ్ షీట్ కప్పుకుంది.

''కమాన్ డియర్, క్విక్!''

ఇంద్రధనస్సులా మెరిసిపోతున్న ఆమె శరీరాన్ని చూసిన యే పురుషుడు ఆ క్షణంలో ఆమెను కోరకుండా ఉండలేడనిపించిందతనికి.

అతనిలో మళ్ళీ కోరిక విజృంభించింది.

''కమాన్ డియర్! యేమిటింకా ఆలోచిస్తున్నారు. బయట తెల్లారిపోతోంటే''




''కమాన్ డియర్. తెల్లారిపోతుంది. పని మనిషొచ్చే టైమైంది''

అతడామెను తనకు దగ్గరగా, ఇంకా దగ్గరకు చేర్చుకునే ప్రయత్నం చేస్తున్నాడు. అతడి అంత రాంతరాల్లో ఆవహించి వున్న ఆమె మీది ఆరాధనకు మాటల రూపం యిచ్చే ప్రయత్నం ప్రారంభించాడతను.

''నా మీద ఏం మత్తుమందు చల్లావు లావణ్యా. నన్నిలా పిచ్చివాణ్ని చేసి నీ చూట్టు, నువ్వే ప్రపంచంగా యెందుకు తిప్పుకుంటున్నావు? ఒక్క క్షణం నిన్ను చూడకపోతే నా హృదయం నీ కోసం యెందుకిలా తపించిపోతున్నది? ఎందుకు లావణ్యా.... నన్నెందుకిలా ప్రపంచానికి వ్యర్థుణ్ని చేశావు? నాలోని ప్రతి అణువులో నువ్వే యెందుకు చేరిపోయావు? నీ మీది ప్రేమతో నిండిపోయిన ఈ పిచ్చి గుండెను నేనేం చేసుకోను... చెప్పు లావణ్యా... చెప్పు''

ఆమె అతి ప్రయత్నంతో అతని తన మీది నుంచి తోసేసింది.

''లేవండి, మిష్టర్ విశాల్, నేను మీ లావణ్యను కాను. కాల్‌గర్ల్ అనూరాధని''.

అతడు తన పక్కలో బాంబు పేలినట్లు దిగ్గున లేచి నిల్చున్నాడు.

''అయామ్ వెరీ సారీ''.

''ఫరవాలేదు. మిమ్మల్ని అదే మూడ్‌లో ఇంకాస్సేపు వుండనిస్తే నా పంతం నెగ్గేదే. కాని మిమ్మల్ని మోసగించి నా పంతాన్ని నెగ్గించుకోవటం నాకిష్టం లేదు. లావణ్యగా కాదు... నన్ను మీరు కాల్‌గర్ల్ అనూరాధగా చూస్తేనే నాకు నిజమైన గెలుపు. కానీ మీ లావణ్యే గెలిచింది''.

ఆమె లేచి చకచకా డ్రెస్ చేసుకోవటం మొదలెట్టింది.

''నువ్వు కాల్‌గర్ల్ అనూరాధవే కావొచ్చు... కాని నిన్ను జీవితాంతం మరచిపోలేను''.

''నేనూ మిమ్మల్ని మరచిపోలేను. నేను చాలామంది మగవాళ్ళను చూశాను. మీలాగే యేవేవో పనుల మీద ఈ ఊరొచ్చి టైమ్ గడవక నాలాంటి కాల్‌గర్ల్స్‌ని పిలిపించుకునే ఎందరో మర్యాదస్తుల్ని, సంస్కారవంతుల్ని చూశాను. కాని మీలాంటి ఇంత ఫెయిత్‌ఫుల్ హజ్బెండ్ నెవర్నీ చూళ్లేదు. మీ లావణ్యను నేను చూడక పోయినా ఆమె పర్సనాలిటీని ఊహించుకోగలను. ఆమెతో పోటీ చెయ్యబోయి ఓడిపోయాను. కాని ఓడిపోయానని బాధ పడటం లేదు. తన భర్తను ఇంతగా ఆకట్టుకున్న ఒక తోటి స్త్రీని హృదయ పూర్వకంగా అభినందిస్తున్నాను''.

ఆమె తన హ్యాండ్ బ్యాంగ్ చేతిలోకి తీసుకుని టీపాయ్ మీదున్న రిస్టు వాచీలో టైమ్ చూసింది.

''అప్పుడే నాలుగౌతోంది... నే వెళ్తాను''.

ఆమె వెళ్ళి పోతాననగానే అతనిలో యేదో దిగులు. అకస్మాత్తుగా లభించిన గొప్ప పెన్నిధిని పోగొట్టుకున్నట్టుగా ఫీలయ్యాడు.

ఏదో గుర్తొచ్చినట్టుగా లేచి బ్రీఫ్ కేసు తెరిచి పర్స్ తీసాడు. అందులోంచి రెండు వంద రూపాయల నోట్లను తీసి ''కాదనకుండా తీసుకోవాలి. ప్లీజ్'' అన్నాడు.

''ఎందుకు? నా నుంచి మీ మగవాళ్ళు యే సుఖాన్నైతే ఆశిస్తారో అది నేను మీకవ్వలేక పోయాను. కాబట్టి మీ దగ్గర డబ్బు తీసుకునే అర్హత నాకు లేదు''.

''నువ్వు నాకు అంతకంటె వెయ్యిరెట్లు అధిక సుఖాన్నిచ్చావు. నా ఒంటరితనాన్ని, దిగులును పోగొట్టావు. నిజమైన స్నేహంలో వుండే మాధుర్యాన్ని ఈ కొద్దిసేపట్లో చూపించావు. కొద్దిగంటల్లో విడిపోతున్న వాళ్ళ మధ్య స్నేహమే మిటన్న నా మాట ఎంత తప్పో నిరూపించావు. ఇదంతా సుఖం కాదూ? శారీరక సుఖమే సుఖమౌతుందా? నా తృప్తి కోసమైనా తీసుకో అనూరాధా, నేనిచ్చిన మాటను ఎలాగూ నిలుపుకోలేక పోయాను''.

ఆమె అదో మాదిరిగా నవ్వుతూ ఆ రెండు నోట్లను తీసుకుంది.

''నాకిచ్చిన మాటను నిలుపుకోలేక పోయానని బాధపడుతున్నారు కదూ. యింకో కొన్ని క్షణాల్లో మనం విడిపోతాం. బహుశా మళ్ళీ యెప్పుడూ కలుసుకోలేక పోవచ్చు. విడిపోయే ముందు నాదొక చిన్న కోరిక. ఈసారి మీరు కాదనకూడదు. తప్పకుండా తీరుస్తారు కదూ?''

''తప్పకుండా... చెప్పు అనూరాధా'' అంటూ ఆమె చేతిలో చెయ్యేశాడతడు.

''మీరు నాకొక చిన్నసహాయం చెయ్యాలి. మీ ఊరు వెళ్ళేటపుపడు ఈ రెండు వందల రూపాయలతో మీ లావణ్యకేదైనా నా తరపున మంచి ప్రెజెంట్ కొనుక్కెళ్ళండి.''

ఆమె ఆ రెండు వందల రూపాయల నోట్లని తిరిగి అతని చేతిలో పెట్టింది.

''అనూరాధా''! అతడేదో అనబోయాడు.

''ఇంకేమీ చెప్పకండి. లావణ్యకు ఆ ప్రెజెంట్ ఇస్తూ... 'ఫ్రమ్ అనూరాధా విత్ లవ్'' అని చెప్పండి. గుడ్‌బై మిష్టర్ విశాల్''!

అతని చేతిని చిన్నగా ముద్దు పెట్టుకుని తలుపు తెరచుకొని బయటికెళ్ళిపోయింది, కాల్ గర్ల్ అనూరాధ.

ఆ రెండు నోట్లను తిరిగి పర్సులో పెడ్తూ ''ఫ్రమ్ అనూరాధా విత్ లవ్!'' అనుకున్నాడు విశాల్.

***(ఆంధ్రజ్యోతి వీక్లీ, 28-3-1980)***

★